క్లుప్తంగా

ఆది, సోమవారాల్లో యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు

పుల్లంపేట : మండల కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆదివారం, సోమవారం యథావిధిగా పని చేస్తుందని పుల్లంపేట సబ్ రిజిస్టర్ మహమ్మద్ రఫీ తెలిపారు. కావున కార్యాలయ పరిధిలోని పుల్లంపేట, ఓబులవారిపల్లి, రైల్వేకోడూరు మండలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌లు కొనసాగుతాయని, ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సంత వేలంపాట వాయిదా

సుండుపల్లె : మండల కేంద్రంలోని కూరగాయల సంత, పశువుల సంత 2025 – 26 సంవత్సరానికి సంబంధించిన వేలంపాటను శుక్రవారం సుండుపల్లె గ్రామ సచివాలయంలో జిల్లా పంచాయతీ ఇంచార్జ్ అధికారి మస్తాన్‌వలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కూరగాయల సంతకు 18 మంది, పశువుల సంతకు 16 మంది వ్యక్తులు ధరావత్తును నగదు రూపంలో చెల్లించి రసీదులను తీసుకొని వేలంపాటలో పాల్గొన్నారు. కూరగాయల సంతను రూ.14.50 లక్షలు సర్కారు వారి పాటను ప్రారంభం చేయగా పశువుల సంతను రూ.6.05 లక్షలతో ప్రారంభించారు. అయితే వేలంపాటలో పాల్గొన్న వ్యక్తులు పలువురు సర్కారు వారి పాట అధికంగా ఉన్నదని చర్చించుకుని ఎవ్వరూ వేలంపాట పాడలేదు. దీంతో వారాంతపు సంతల వేలాన్ని వాయిదా వేసి తదుపరి వేలాన్ని ఏప్రిల్ 2వ తేదీ బుధవారం రోజున నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి తెలియజేశారు.

ఉపాధి పనిదినాలు పెంచాలి

రైల్వేకోడూరు అర్బన్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని శుక్రవారం సీపీఐ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు సిగి చిన్నయ్య డిమాండ్ చేశారు. ఉర్లగడ్డపోడులోని ఉపాధి కూలీలతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని ప్రాంతంలో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఎండా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పని జరిగే చోట షామియానా, తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే వారికి పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాధ్యతల స్వీకరణ

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా సుందరం రాజ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలను అన్ని విధాల అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులు చేసుకోవచ్చని వారు తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయని తెలియజేశారు.

అన్నప్రసాదం వితరణ

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కురబ ఎంప్లాయిస్ ఎంపవర్‌మెంట్ సొసైటీ(కీస్) ఆధ్వర్యంలో నడుస్తున్న చలివేంద్రం వద్ద గుంటూరు జిల్లా జిల్లెల్ల మూడీ అనసూయ మాత విద్యాసంస్థల్లో చదివిన పూర్వ విద్యార్థులు అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల లెక్చరర్ డా.రామకృష్ణాంజనేయులు కీస్ కార్యదర్శి చెన్నకేశవులు, వైస్ ప్రెసిడెంట్ బిసి రమణ, కోఆర్డినేటర్ రఘునాథ, శ్రీనివాసులు, డా.మదన్‌మోహన్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్ శివయ్య, లెక్చరర్స్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో బాలికలు ఆరవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరుటకు విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాయి దివ్య తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వివరాలకు 80747 34897, 79810 72506 లను సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి ఉగాది ఉత్సవాలు

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేటలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో ఉగాది పర్వదినం నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఏప్రిల్ 6న ఉదయం 11:15 గంటలకు ఆలయంలో మహా గణపతి పూజలు, స్వస్తివాచకం, పంచామృత అభిషేకాలు, ఉభయ దాతల పూజలు, మధ్యాహ్నం శాశ్వత కల్యాణ దాతల ఆశీస్సులు పొందుతారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.

నిజాయితీ ఉద్యోగిని బ్లాక్ మెయిల్ చేయడం తగదు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు అటవీశాఖలో నిజాయితీగా పనిచేస్తున్న దళిత ఉద్యోగి ఎ.శ్యామసుందర్‌పై సోషల్ మీడియా పత్రికల్లో బ్లాక్ మెయిల్ చేసేలా వార్తలు రాయడాన్ని వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండుగోల మణి ఖండించారు. శుక్రవారం దళిత ఉద్యోగి శ్యాంసుందర్‌ను మణి కలుసుకుని ధైర్యం పలికారు. ఆయన మాట్లాడుతూ గతంలోనూ కొందరు గుర్తింపు లేని పేపర్లను అడ్డంపెట్టుకొని అధికారులను బెదిరిస్తున్నారని తెలిపారు. నిజాయితీగా పనిచేస్తున్న ఫారెస్టు అధికారి శ్యామ్ సుందర్‌ను డబ్బుల కోసం బెదిరింపు ధోరణిలో వార్తలు రాయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రేంజర్‌గా పనిచేస్తున్న శ్యామ్ సుందర్‌ను ఇకపై వేధిస్తే తమ దారిలో గుణపాఠం చెబుతామని వారు పేర్కొన్నారు.

నోరూరించే హలీమ్.. రుచి చూశారా గులామ్

- రంజాన్ మాసంలోనే దొరికే ప్రత్యేకమైన వంటకం
- రాయచోటిలో మంచి డిమాండ్


హలీమ్‌ను కొనుగోలు చేస్తున్న ప్రజలు

రాయచోటి జగదాంబసెంటర్ : పవిత్రమైన రంజాన్ మాసానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. రోజా, ఇఫ్తార్, సహెరీ(ఉపవాస దీక్షలు)లతో పాటు పసందైన ఆత్మీయ విందులతో పండుగ శోభను మరింత పెంచుతాయి. రంజాన్ మాసం వచ్చిందంటే చాలు మనందరికీ వెంటనే గుర్తొచ్చే వంటకం హలీమ్. మొదట్లో దేశంలోని ప్రముఖ నగరాల్లో అందుబాటులో ఉండే ఈ వంటకం, గత కొన్నేళ్లుగా రాయచోటిలో హలీమ్‌ను తయారు చేస్తూ పట్టణ ప్రజలకు విక్రయిస్తున్నారు. రుచికరమైన హలీం లభిస్తుండటంతో ప్రజలు కూడా అధిక సంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు.

హలీమ్ తయారీ ఇలా

హలీమ్‌లో మంచిరకం గోధుమ రవ్వ, చికెన్ లేదా మటన్ ప్రధానమైన వస్తువులు. పప్పు దినుసులకు తోడు ఆరు నుంచి పది రకాల డ్రైఫ్రూట్స్, నెయ్యి, మిరియాలు, ఉద్ది బేడలు, జీలకర, సూగులు, గశాలు, సాజిర సువాసన కోసం రాతిపువ్వులు, ఎండిన గులాబీపువ్వు రేకులు కలిపి హలీమ్ తయారు చేస్తారు. తొలుత గోధుమరవ్వతో పాటు మాంసం, కొన్ని రకాల దినులను నాలుగు గంటల పాటు ఒకే మంటపై ఉడికిస్తారు. తర్వాత మరి కొన్ని రకాల మసాలా దినుసులను బాగా రుబ్బి ఇందులో వేసి మరో గంటపాటు ఉడికిస్తారు. ఇలా ఆరు నుంచి ఏడు గంటల పాటు ఉడికించిన హలీమ్‌ను సాయంత్రం ఇఫ్తార్ సమయానికి సిద్ధంగా ఉంచుతారు. సాయంత్రం 4 గంటల నుంచి విక్రయాలు ప్రారంభమవుతాయి. రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉండేవారు నీరసపడకుండా ఎక్కువ మంది హలీమ్‌ను ఆహారంగా తీసుకుంటారు.


హలీమ్‌ను తయారు చేసిన దృశ్యం

బలవర్ధకమైన ఆహారం హలీమ్



పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎక్కువ మంది ఉపవాస దీక్షలు చేస్తుంటారు. సాయంత్రం పూట దీక్ష ముగించిన తర్వాత బలమైన ఆహారం తీసుకుంటుంటారు. ఇందులో హలీమ్ ఎంతో ముఖ్యమైంది. మాంసకృత్తులు, పిండి పదార్థాలు, పప్పు దినుసులు ఇలా అన్నీ కలిసిన ఆహారం కావడం వల్ల శరీరానికి అన్ని పోషక పదార్థాలు చక్కగా అందుతాయి.

– షేక్ ఖాదర్‌వలీ, ఎస్ఎన్ కాలనీ, రాయచోటి

చాలా ఇష్టంగా తింటారు



రంజాన్ మాసంలో దొరికే హలీమ్‌ను మా ఇంట్లో చిన్నా పెద్దా అని తేడా లేకుండా ఎంతో ఇష్టంగా తింటారు. చికెన్, మటన్ రెండు వెరైటీల్లోనూ లభిస్తుండటం కలిసొచ్చే అంశం. ఉపవాస వేళ హలీమ్ తినడం ద్వారా శరీరానికి మంచి శక్తి లభిస్తుంది. గతంలో కేవలం హైదరాబాద్ లాంటి నగరాల్లో మాత్రమే హలీమ్ దొరికేది అప్పుడప్పుడూ అక్కడికి వెళ్లి తినేవాళ్లం. అయితే గత కొన్ని సంవత్సరాలుగా రాయచోటిలోనే హలీమ్ దొరుకుతుండటంతో ఇంటిల్లిపాది ఇష్టంగా తింటున్నారు.

– మైనుద్దీన్, బీరాంసాబ్ వీధి, రాయచోటి

నేడు ఓపెన్ ఫోరం

గాలివీడు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నేటి (శనివారం) ఉదయం 10 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్‌పీ, ఎస్ఎస్ఏటీల ఆధ్వర్యంలో మార్చి 14 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన సామాజిక తనిఖీలో కనుగొన్న విషయాలను సమావేశంలో చర్చిస్తామన్నారు. ఈ బహిరంగ సభకు ప్రజాప్రతినిధులు, ప్రజలు, రైతులు, ఉపాధి వేతనదారులు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ సిబ్బంది హాజరు కావాల్సిందిగా కోరారు.

రంజాన్ తోఫా పంపిణీ


పేదలకు రంజాన్ తోఫా అందజేస్తున్న దృశ్యం

నందలూరు : నందలూరు జిల్లా పరిషత్ క్రీడా మైదానం పరిసర ప్రాంతాలలోని 15 మంది నిరుపేదలకు మండల మైనార్టీ నాయకులు షేక్ మౌలా, పఠాన్ మెహర్ ఖాన్‌లు రంజాన్ తోఫాను శుక్రవారం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే దాదాపు 60 కుటుంబాలకు పైగా పేదల ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు అందజేయడం జరిగిందన్నారు.

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి


భూసార పత్రాలను పంపిణీ చేస్తున్న ఏఓ మల్లిక

ఓబులవారిపల్లె : రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని ఏఓ మల్లిక అన్నారు. శుక్రవారం చిన్నఓరంపాడు వ్యవసాయ కేంద్రం వద్ద భూసార పరీక్షా పత్రాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లిక మాట్లాడుతూ 2024 – 25 సంవత్సరానికి గాను మండలంలో దాదాపు 600 మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలకు పంపించడం జరిగిందన్నారు. వాటి ఫలితాల పత్రాలను రైతులకు అందజేశామని తెలిపారు. సేంద్రియ ఎరువులు వాడకం ద్వారా భూసారం పెంచుకోవచ్చని, తద్వారా భవిష్యత్తు తరాలకు ఉపయోగకరమైన సారవంతమైన నేలను ఇవ్వగలమని రైతులందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు. అనంతరం రైతులకు భూసార పరీక్షల పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు విధానం రద్దు చేయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ నేత రవికుమార్

రాజంపేట : మున్సిపాలిటిలో కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని, పాత కార్మికులనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవి కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఏపీఎన్‌జీఓ హోంలో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. కార్మికులందరూ గత ప్రభుత్వంలో ఆక్వాస్ విధానంలో పనిచేశారన్నారు. ఈ కాంట్రాక్టు రద్దు చేయాలని యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. 60 సంవత్సరాలు దాటిన వారిని తొలిగించాలనుకోవడం ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు చర్య అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆర్థికంగా కార్మికులు నష్టపోతారన్నారు. కూటమి ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికులు ఎంతకాలం పనిచేస్తే అంత కాలం వారిని కొనసాగించాలన్నారు. కూటమి ప్రభుత్వం తమ డిమాండ్‌లను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. సమావేశంలో మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, జిల్లా కోశాధికారి లక్ష్మిదేవి, రాజంపేట డివిజన్ నాయకులు కె.ప్రసాద్, ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

భూమి సరిహద్దులను చూపించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీకేఎంయూ నాయకులు

ఓబులవారిపల్లె : దశాబ్ద కాలం క్రితం మండలంలో గిరిజనులు, దళితులు, ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన పట్టా పాసు పుస్తకాలను ఆన్‌లైన్ చేయించి భూమి సరిహద్దులు చూపించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తహసీల్దార్ శ్రీధర్ రావు కోరారు. శుక్రవారం వారు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో అధికారులు భూమిలేని పేదలకు పట్టాలు, పాసుపుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ ఆన్‌లైన్ చేసి భూమి సరిహద్దు చూపించలేదని ఆరోపించారు. సంవత్సరాలు గడుస్తున్నా ఆన్‌లైన్ లేకపోవడంతో వారు ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నారని, ఇప్పటికైనా స్పందించి వారికి ఇచ్చిన భూమి పాసుపుస్తకాలను ఆన్‌లైన్ చేసి సరిహద్దులు చూపించాలని లేని పక్షంలో ఏప్రిల్ 10న పెద్దఎత్తున రైతులతో కలిసి 'ఆకలి కేక పోరుబాట' కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో బీకేఎంయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండుగోల మణి, నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య, మండల కార్యదర్శి మల్లిక, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు మహా పుణ్యకార్యం


రాజంపేట టౌన్: ఇఫ్తార్ విందులో ముస్లింలను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్ : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఉండే ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం మహాపుణ్య కార్యమని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వజ్రం కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే ఆకేపాటి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లాహ్ కృప వల్లే గత రెండు దశాబ్దాలకు పైగా రంజాన్ మాసంలో క్రమం తప్పకుండా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్నట్లు చెప్పారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదన్నారు. ఇఫ్తార్ విందులతో అన్ని వర్గాల ప్రజల్లో సోదరభావం, మతసామరస్యం ఏర్పడుతుందని తెలిపారు. విందులో పాల్గొన్న ముస్లింలను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి సోదరుడు, వైఎస్సార్ సీపీ నియోజకర్గ ఇన్‌ఛార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలకు స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, మండల కో–ఆప్షన్ మెంబర్ సయ్యద్ గౌస్‌బాషా, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు జెనుగు కృష్ణారావుయాదవ్, వడ్డే రమణ, రాకాసి శ్రీవాణి, మిర్యాల సురేఖ, జాహీద్ అలీ, ఖాజామొహిద్దీన్, మసూద్, అబ్దుల్ మునాఫ్, షఫివుల్లాఖాన్, షాకీర్, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.


రైల్వేకోడూరు అర్బన్: ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : ఉపవాసాలు ఉన్న ముస్లిం మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్య కార్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మండలంలోని రాఘవరాజుపురం మసీదులో గల్ఫ్ మైనార్టీ నాయకులు సయ్యద్ మహ్మద్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. మాట్లాడుతూ రంజాన్ పండుగ మతసామరస్యానికి నిదర్శనమన్నారు. రంజాన్ ప్రతి ముస్లిం సోదరుడు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన సయ్యద్ మహ్మద్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, ఆర్‌వీ రమణ, సీహెచ్ రమేష్, బండారు మల్లికార్జున, సిద్దయ్య, గల్లా శ్రీను ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి.. ఏంటీ దుస్థితి

- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- అసౌకర్యాలకు లోనవుతున్న ప్రజలు


పీహెచ్‌సీ గేటు ఎదురుగా మురుగు పారుతుండటంతో పక్క నుంచి వెళుతున్న వృద్ధురాలు


ఆస్పత్రి వద్ద మురుగునీటి కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారం

చిన్నమండెం : మండల కేంద్రం మురుగుమయంగా మారింది. చిన్నమండెంలో ఏర్పాటు చేసిన మురుగునీటి కాలువలు పొంగిపొర్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏరులై పారుతోంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిండిన మురుగుకాలువ ఆ నీరంతా రోడ్డుపై పారుతూ వంకను తలపిస్తోంది. ఇంత తతంగం జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలంటే గేటు వద్దనే మురుగుకాలువ ఏరులాగా ప్రవహిస్తోంది. ఆసుపత్రికి వెళ్లాలంటే ముక్కున వేలేసుకోవడమే కాక చాలా జాగ్రత్తగా నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రోగులు ఆసుపత్రికి వెళ్లాలంటే తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పలు మార్లు పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నమండెం మండల కేంద్రంలోనే ఇలాంటి దుస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా మురుగునీరు కాలువలు కొన్ని చోట్ల బ్లాక్ కావడంతో ఆ నీరంతా బయటకు వెళ్తోందని వాపోతున్నారు. దానికితోడు తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో ఆ ప్రాంతంలో ప్రజలు నడవాలన్నా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముక్కున వేలు వేసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దానికితోడు దోమలు ఉధృతితో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మురుగునీటి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి దుర్గంధం లేకుండా చూడాలని మండల కేంద్రం వాసులు, ఆస్పత్రి సిబ్బంది, రోగులు కోరుతున్నారు.

పేర్ల నమోదుకు నేడే చివరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీధర్

నందలూరు : స్మాషర్స్ షటిల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 30, 31వ తేదీలలో అన్నమయ్య, కడప జిల్లా స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ నాన్ మెడలిస్ట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ నందలూరు రైల్వే కేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనేవారు ఈనెల 29వ తేదీ (నేడు) లోపల తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మెడల్స్ ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పుత్తనవారిపల్లిలో రీ సర్వే

పుల్లంపేట : మండల పరిధిలోని పుత్తనవారిపల్లి గ్రామంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో రీ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూముల రీ సర్వేకు సంబంధించి అవగాహన కల్పించారు. ప్రతి రైతుకు హద్దులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీరాములు, వీఆర్ఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

లవణ కణాలు తగ్గకుండా జాగ్రత్త వహించాలి

సిద్దవటం : శరీరంలో ఉన్న లవణ కణాలు తగ్గకుండా మజ్జిగ, మంచి నీరు తీసుకుంటూ ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు సూచించారు. మండల కేంద్రంలోని ఎగువపేట ముదిరాజ్ కాలనీలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే సందర్భంగా ఇంటి పరిసర ప్రాంతాను శుభ్రంగా పెట్టుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మురుగు నీరు ఉన్న ప్రాంతాల్లో లార్వా ఉత్పత్తి చెంది, దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. దీంతో విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు తెలియజేశామన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వయోవృద్ధులు జాగ్రత్తలు వహించాలన్నారు. ఎండలకు బయట తిరగరాదన్నారు. లేదంటే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పి.కొత్తపల్లె పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మౌలాలి, ఆరోగ్య కార్యకర్తలు లక్షుమ్మ, శారద, ఆశ వర్కర్‌లు ఓబులమ్మ, భారతి, పద్మావతి, ప్రజలు పాల్గొన్నారు.

పని తీరు మార్చుకోండి


అతిగారిపల్లి గ్రామాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్

పెనగలూరు : మండలంలోని ఓబిలి పంచాయతీ అతిగారిపల్లి దళితవాడకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్ నీటి సమస్యను పరిష్కరించారు. దళితవాడకు ఆరు నెలలుగా నీరు రాకపోవడంతో అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో ప్రజలు నేరుగా ఎస్ఈకి సమస్యను విన్నవించారు. దీంతో దళితవాడను పరిశీలించి ఇన్ని రోజులుగా తాగునీటిని అందించలేకపోవడంపై వారు సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రత్యేకంగా పైప్‌లైన్ వేసి చెయ్యేరు నుంచి తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సునీత, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా ప్రొద్దుతిరుగుడు

సిద్దవటం : మండలంలోని ఖాజీపల్లె, దేగనవాండ్లపల్లె గ్రామాల్లోని ప్రొద్దుతిరుగుడు పంటను శుక్రవారం పరిశీలించినట్లు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని టక్కోలు, మాచుపల్లె రైతు సేవా కేంద్రాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ప్రొద్దు తిరుగుడు పంట ఆశాజనకంగా ఉందని, పంటలో పువ్వు ఆకుల మీద శనగ పుచ్చు పురుగును గమనించామన్నారు. తీవ్రత ఎక్కువగా ఉన్నట్లయితే స్పైనోసాడ్ అనే పురుగుల మందును లీటరు నీటికి 0.3 మిల్లీ లీటర్లు చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు.

ఆరుతడి.. మిగిల్చింది కంటతడి!

- నెల వ్యవధిలో అమాంతం పడిపోయిన ధరలు
- నష్టాల ఊబిలో దోస రైతులు


నల్లపరెడ్డిపల్లిలో దోసకాయలు కోస్తున్న రైతు

పెనగలూరు : మండలంలో దోస పంట వేసిన రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. మండల వ్యాప్తంగా 90 హెక్టార్లలో దోస పంటను సాగు చేశారు. కోతకొచ్చిన సమయంలో పంటను కొనే వారు లేకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుంటూ నష్టాల పాలవుతున్నట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. టన్ను దోసకాయలు రూ.7 వేలు పలుకుతుండటంతో తమ బాధను పట్టించుకునే వారు లేక కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలో అత్యధికంగా నల్లపరెడ్డిపల్లి పంచాయతీలో దోసపంటను సాగు చేశారు. ఈ పంటను సాగు చేయాలంటే ఎకరాకు దాదాపు రూ. 70 వేలు ఖర్చు వస్తుందని రైతులు అంటున్నారు. పంట వేసినప్పటి నుంచి ఎరువులు, పురుగు మందులు ఇడుపులేకుండా ఎప్పుడూ పొలంమీదనే ఉండాల్సి వస్తుందని రైతులు తెలియజేస్తున్నారు. ఇంత ఖర్చు చేసినా పంట చేతికి వచ్చే సమయానికి ధర పడిపోయింది. ఫిబ్రవరి నెలలో టన్ను రూ.18 వేలు పలికితే మార్చి నెలలో రూ.7 వేలుకు పడిపోయింది. ఈ ధరను పోల్చుకుంటే ఆదాయం వచ్చే మార్గమే లేదని రైతులు తెలియజేస్తున్నారు. ఎకరాకు రూ. 10 వేలు నుంచి రూ. 20 వేలు వరకు నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుతడి పంటలు వేస్తే మంచి ఆదాయం పొందవచ్చన్న ఆలోచనతో దోస పంటను సాగు చేస్తే ఆదాయం బదులు నష్టం వస్తోందని, దోస రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

ఐదు ఎకరాలలో సాగుచేశా



ఐదు ఎకరాలలో దోసపంట సాగు చేస్తే ధర విపరీతంగా దిగుబడి తగ్గిపోవడంతో నష్టం తప్ప లాభం వచ్చే మార్గం కనిపించడం లేదు. ఆరుగాలం కష్టపడి సాగు చేస్తే పంట చేతికొచ్చే సమయంలో ధరలు లేకపోవడం ఆవేదనకు గురిచేస్తోంది. వ్యవసాయానికి దూరంగా ఉన్నా మేలు అనే పరిస్థితి వచ్చింది. దోస పంటకు కూడా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులకు మేలు చేయాలి.

– రామచంద్రారెడ్డి, రైతు నల్లపరెడ్డిపల్లి

ధరలు పడిపోవడం దారుణం



నాకు ఉన్న 3.5 ఎకరాల పొలంలో దోస వేశాను. మంచి దిగుబడి వస్తుంది ఆశించా.. అనుకున్నంత దిగుబడి రాకపోగా వచ్చిన పంటకు సరైన గిట్టుబాటు లేదు. దోసను కొనేందుకు ముందుకు వచ్చే వ్యాపారి కనిపించడంలేదు. వచ్చిన వారు తక్కువ ధరలు చెప్పుండటంతో ఏమీ చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉన్నాం. ప్రస్తుతం ఉన్న ధరలకు పంటను అమ్ముకుంటే భారీ నష్టాలను ఎదుర్కోవాల్సిందే.

– కామనూరు నరసింహారెడ్డి, రైతు నల్లపరెడ్డిపల్లి